క్లుప్తంగా

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి సూచించారు. కళాశాలలో సోమవారం వ్యాస రచన పోటీల్లో విజేతల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎడిటర్స్ అసోసియేషన్ వారు ఆదివారం నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో కీర్తన ద్వితీయ, జీ గణేష్ తృతీయ స్థానాల్లో నిలవడం కళాశాలకే గర్వకారణంగా పేర్కొన్నారు. మున్ముందు మరిన్ని పోటీల్లో సత్తాచాటి కళాశాల, నగర ఖ్యాతిని ఇనుమడింప చేయాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కల్చరల్ విభాగ సమన్వయకర్త డాక్టర్ కేవీ శాంతకుమారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శైలజ, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

కయాకింగ్ జాతీయ పోటీలకు తన్విత్



విజయవాడస్పోర్ట్స్: కానోయింగ్, కయాకింగ్ సబ్‌జూనియర్, జూనియర్ జాతీయ పోటీలకు విజయవాడ క్రీడాకారుడు ఎం.తన్విత్ ఎంపికయ్యాడు. ఇటీవల విజయవాడలో జరిగిన ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించి 200 మీటర్ల జూనియర్స్, 500 మీటర్ల సబ్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఫిబ్రవరి తొమ్మిది నుంచి 12వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరిగే జాతీయ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన తన్విత్‌ను కయాకింగ్ సంఘం కార్యదర్శి జగదీష్ అభినందించారు.

సురేష్‌కుమార్‌కు యువ ప్రజ్ఞ అవార్డు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ రామన్ ఫౌండేషన్ ప్రతిష్టాత్మకంగా అందించే యువ ప్రజ్ఞ అవార్డును ఈఏడాది సింగ్‌నగర్ శ్రీరామ్ స్కూల్స్ ప్రిన్సిపాల్ బోనీ సురేష్ కుమార్‌కు అందజేశారు. వన్‌టౌన్ కేబీఎన్ కళాశాలలో డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారు ఆదివారం సాయంత్రం నిర్వహించిన నంది నాటక విజయోత్సవ సభ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జీ శ్రీకాంత్, పొట్టి శ్రీరాములు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ చైర్మన్ చలువది మల్లికార్జునరావు చేతుల మీదుగా సురేష్‌కుమార్ ప్రజ్ఞా పురస్కార అవార్డును అందుకున్నారు. శ్రీరామ్ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్‌ను అభినందించారు.

హోం గార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం



విజయవాడస్పోర్ట్స్: అనారోగ్యానికి గురై మరణించిన హోం గార్డ్ డొక్కు వెంకటేశ్వరరావు కుటుంబానికి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోం గార్డులు ఆర్థిక చేయూతనిచ్చారు. హోం గార్డులు అందరూ కలిసి వారివారి ఒక్క రోజు వేతనాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. మొత్తం రూ. 5 లక్షల చెక్కును పోలీస్ కమిషనర్ టి.కె.రాణా చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు ఆర్ఐ శ్రీకృష్ణ సమక్షంలో సోమవారం పంపిణీ చేశారు.

బస్‌స్టాప్‌లో మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిబంధనలకు విరుద్ధంగా బస్టాప్‌లో మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని నూజివీడుకు వెళ్లే బస్సులు ఆగే బస్‌షెల్టర్ వద్ద మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో తనిఖీలు చేసేందుకు వెళ్లగా వెంకన్న అనే వ్యక్తి పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. అతన్ని అదుపులోకి తీసుకోగా అతని వద్ద 180 ఎంఎల్ విస్కీ బాటిళ్లు 10 కనిపించాయి. దీంతో అతడిని అరెస్ట్ చేసి, మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంను విమర్శించే అర్హత నాదెండ్లకు లేదు

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- 57వ డివిజన్‌లో గడప గడపకు మన వెలంపల్లి శ్రీనివాస్



స్థానిక ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, పక్కన డిప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్ దేవీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టిన అభ్యర్థుల చేతుల్లో ఘోరంగా ఓడిపోయి.. పవన్‌కళ్యాణ్‌తో కలిసి పనికిమాలిన రాజకీయాలు చేసే నాదెండ్ల మనోహర్‌కు ముఖ్యమంత్రిని విమర్శించే అర్హత లేదని ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలో గడప గడపకు మన వెలంపల్లి శ్రీనివాస్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు ఇసరపు దేవి, బాలిగోవింద్, యలకల చలపతిరావులతో కలిసి ఆయన పాల్గొన్నారు. న్యూఆర్ఆర్‌పేటలోని ఇంటింటికి తిరిగి స్థానిక సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

సీఎంను విమర్శించడం సిగ్గుచేటు

ఎన్నికల మేనిఫెస్టోని బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించి ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. తమ ప్యాకేజీల కోసం పూటకో పార్టీతో పొత్తులు పెట్టుకొని అక్రమార్జన చేసే పవన్ కళ్యాణ్‌తో కలిసి తిరిగే నాదెండ్ల మనోహర్ లాంటి వ్యక్తులు కూడా సీఎం మీద వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్నన్ని రోజులు బోండా ఉమా కబ్జాలు, దౌర్జన్యాలు, దోపిడీలు చేయడానికే సరిపోయిందని విమర్శించారు.

టీడీపీ చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలే

టీడీపీ మేనిఫెస్టో పేరుతో చెబుతున్న అంశాలన్నీ పచ్చి అబద్ధాలని పేర్కొన్నారు. ఎలా అయినా అధికారంలోకి రావాలనే దుర్బుద్ధితో ఆచరణకు సాధ్యం కాని పథకాల పేర్లు చెప్పి మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి విమర్శించారు. జగన్న ఇస్తున్న కొన్ని పథకాలకు పేర్లు మార్చి మేనిఫెస్టోలో చెప్పుకోవడం హాస్యాస్పదమని అన్నారు. చంద్రబాబు, ఎల్లోమీడియా, పవన్ కళ్యాణ్‌లాంటి వ్యక్తులంతా ఏకమై ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ప్రజలెవ్వరూ వాటిని నమ్మరని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇసరపు రాజు, ఆదినారాయణ, బాలా, ప్రేమ్, చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వీఎంసీ కౌన్సిల్ సమావేశం

- 100 ప్రతిపాదనలతో ఎజెండా
- 12 అంశాలపై ప్రశ్నోత్తరాలు
- ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ ప్రారంభం



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రణాళికాబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం వీఎంసీ సర్వసభ్య సమావేశం జరగనుంది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో మొత్తం 100 అంశాలు ఎజెండాలో ప్రతిపాదనకు రాగా 12 ప్రశ్నలు ప్రశ్నోత్తరాల్లో సభ్యులు అధికారులను ప్రశ్నించనున్నారు.

ప్రధానాంశాలు :

- వీఎంసీ సర్కిల్–3 పరిధిలోని 22వ డివిజన్‌లో ఉన్న దోభీ ఘాట్ డీపీ స్టేషన్ నుంచి సీవర్‌లైన్ వరకు ఉన్న యూజీడీ లైన్ లీకులు కారణంగా తాగునీరు కలుషితమవుతున్న నేపథ్యంలో స్థానికంగా మినీ ఎస్టీపీ నిర్మించాలని, ఇందుకు అయ్యే రూ. 98.62 లక్షలు వ్యయాన్ని కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి నిధులు కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనపై కౌన్సిల్ సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు.
- నగరంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉన్నందున వాటికి యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) నిర్వహించేందుకు హైదరాబాద్‌కు చెందిన నవోదయ వెట్ సొసైటీకి మూడేళ్ల పాటు ఏబీసీ ఆపరేషన్స్ నిర్వహించేందుకు, ఇందుకు ఒక్కో కుక్కకు రూ. 1500 చెల్లింపులు కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనపై కౌన్సిల్ సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు.
- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 24వ డివిజన్ పరిధిలోని 7, 92వ సచివాలయం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం కాంప్లెక్స్‌పైన ఉండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారని, ఇందుకు ప్రత్యామ్నాయంగా ఇదే డివిజన్‌లోని ఆర్పీఎం చర్చిరోడ్డులో ఉన్న ఖాళీ స్థలంలో సచివాలయాలకు భవనం నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ కుక్కల అనిత ప్రతిపాదించారు.
- విజయవాడ నగరపాలక సంస్థ తరఫున యువజనోత్సవాలు నిర్వహించాలని ట్రాఫిక్ అండ్ స్పోర్ట్స్ స్పెషల్ కమిటీ చైర్‌పర్సన్, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల నర్సకుమారి కౌన్సిల్‌కు ప్రతిపాదించారు.

ప్రశ్నోత్తరాలు :

- నగరంలోని ఒకే డోర్ నంబరుతో రెండు తాగునీటి పన్నులు ఉన్నాయని, అలాంటివి నగర వ్యాప్తంగా ఎన్ని ఉన్నాయని కౌన్సిల్ సభ్యులు ప్రశ్నోత్తరాల్లో ప్రస్తావించనున్నారు.
- వీఎంసీకి రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఎస్టేట్స్, ప్రజారోగ్య విభాగంకు రావాల్సిన ఆదాయం, ఆస్తులు, ఉన్న కేసులు, తీసుకున్న చర్యలపై సభ్యులు ప్రశ్నించనున్నారు.
- నగరంలో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్న ఆయా సంస్థల యజమానులు భూగర్భ జలాలను వినియోగించుకుంటున్నందున కార్పొరేషన్‌కు పన్నులు చెల్లిస్తున్నారా?, నగరంలో అధికారిక, అనధికారిక వాటర్ ప్లాంట్లు ఎన్ని ఉన్నాయని సభ్యులు ప్రశించనున్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



ట్రై సైకిళ్లను అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దివ్యాంగులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆత్మస్థైర్యం, విశ్వాసంతో ముందుకు వెళ్లి అనుకున్న లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో అర్హులైన 11 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ. 1,57,000 విలువైన ట్రై సైకిళ్లు, ల్యాప్‌టాప్‌లను కలెక్టర్ ఢిల్లీరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని దీనిలో భాగంగా విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లు, ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శారీరక వైకల్యం అనేది జీవనానికి అడ్డంకి కాకూడదని వారికి మరింత తోడ్పాటు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగి అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. ఉపకరణాలకు వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వికలాంగులకు కృత్రిమ అవయవాలు, అవసరమైన వారికి వినికిడి యంత్రాలు, బధిర, మూగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, టచ్‌ఫోన్లను, ఉపకరణాలు పంపిణీతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. దివ్యాంగులలో ఆత్మస్థైర్యం నింపేలా క్రీడా పోటీలు, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ ద్వారా వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఒక్కొక్కటి రూ. 6,500 విలువగలిగిన ట్రై సైకిళ్లను 8 మందికి, ఒక్కొక్కటి రూ. 35 వేలు విలువగలిగిన ల్యాప్‌టాప్‌లను ముగ్గురుకి కలెక్టర్ పంపిణీ చేశారు. అలాగే ఏడుగురు హిజ్రాలకు గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ వి.కామరాజు పాల్గొన్నారు.

రేపు దాసాంజనేయ స్వామివారి హుండీ లెక్కింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలోని హుండీలను బుధవారం దేవదాయశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో లెక్కించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగిసేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు దేవదాయశాఖ సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు సంప్రదాయ దుస్తులతో హుండీ లెక్కింపులో పాల్గొనవచ్చని వారు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీపీటీవో

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సేవలు కల్పించి వారి భద్రత ప్రమాణాలు పాటించే దిశగా ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు డయల్ యువర్ డీపీటీవో (జిల్లా ప్రజారవాణా అధికారి) కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.ఏసుదానం తెలిపారు. ప్రయాణికులు మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య ఫోన్ నంబర్ 9959225446 కు ఫోన్ చేసి తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులు తెలియజేయాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్



అధికారులతో కలిసి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్, కార్పొరేటర్ జానారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్ హెచ్చరించారు. స్థానిక 30వ డివిజన్ రామకృష్ణాపురంలో సోమవారం నగరపాలకసంస్థ అధికారులు, స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డితో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణ పట్ల కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ రోజూ మురుగు కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. డివిజన్‌లో దోమలు పెరిగిపోతున్నా మలేరియా విభాగం సిబ్బంది ఏం చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. దోమల నివారణ చర్యల వివరాలు రికార్డులను పరిశీలించారు. దోమల నివారణ చర్యలు వేగవంతం చేయాలని, మురుగు కాలువలు సక్రమంగా పారేలా చూడాలని ఆదేశించారు. కార్పొరేటర్ బీ జానారెడ్డి మాట్లాడుతూ దోమల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కావున బుడమేరు, ఏలూరు కాలువలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఫాగింగ్, మురుగు కాలువల్లో ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేయించాలన్నారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం డివిజన్‌లో తిరిగి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు పరిసరాలు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ డీఈ గుర్నాథం, సీఎంహెచ్ఓ డాక్టర్ రత్నావళి, మలేరియా, పారిశుద్ధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

5 నుంచి భారతీతీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలు

విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠపాలితులు, జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలను ఫిబ్రవరి 5 నుంచి ఏప్రియల్ 14 వరకు శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో నిర్వహిస్తున్నట్లు క్షేత్రధర్మాధికారి హనుమత్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 74 రోజులపాటు దేవాలయంలో ప్రతి రోజూ ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, శ్రీ చక్రనవావరణ, సాయంత్రం ఆది దంపతులకు త్రిశతి, మహామంగళ హారతి పండిత ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్, సీతారామపురం సబ్ స్టేషన్, 11 కేవీ సూర్యారావుపేట ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ నందమూరినగర్, భారతమాత మందిరం 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల తనిఖీ, మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రైల్వే టెక్నీషియన్‌పై దాడి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): భార్యతో విభేదాలు రావడంతో ఆమెకు దూరంగా ఉంటున్న ఓ రైల్వే టెక్నీషియన్‌పై భార్య, బావమరిది, అత్తమామలు దాడి చేసిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బసవతారకనగర్ ప్రాంతానికి చెందిన దిబ్బ చిన్నబాబు(34)కు హనుమాన్‌జంక్షన్‌కు చెందిన నాగజ్యోతితో 2016లో వివాహమైంది. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. గత కొద్దికాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో పెద్దపాడు పోలీస్‌స్టేషన్‌లో నాగజ్యోతి భర్త చిన్నబాబుపై 498(ఏ) కేసు పెట్టింది. నాటి నుంచి భార్యాభర్తలిద్దరూ వేరుగా ఉంటున్నారు. ఈ నెల 28వ తేదీ రాత్రి భార్య నాగజ్యోతి, బావమరిది జగదీష్, అత్త దుర్గ, చిన్నమామ హరిబాబులు కలిసి చిన్నబాబు ఇంటికి వచ్చి మాట్లాడుతుండగా వారి మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో వచ్చిన నలుగురు వ్యక్తులు చిన్నబాబును, అతడి తల్లిని చితకబాదారు. ఇనుపరాడ్డుతో చిన్నబాబును కొట్టడంతో అతని తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పందన వినతులకు శాశ్వత పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడ తూర్పు): ప్రజల నుంచి అర్జీలు అందుకోవడంతో పాటు సమస్యకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని, అధికారులు ఈ మేరకు ప్రణాళికలు అమలు చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో వినతులు స్వీకరించారు. అధికారులు ప్రజల సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని వాటిని క్షుణ్ణంగా చదివి అంతిమ పరిష్కారం అందించాలని సూచించారు. సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. అభివృద్ధి లక్ష్యాల సాధనకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను సక్రమంగా వినియోగించుకొని స్పందన వినతులపై ప్రతి రోజు సమీక్ష నిర్వహించి త్వరితగతిన పరిష్కారం చూపాలని తెలిపారు. మొత్తం 19 వినతులు రాగా అందులో ఇంజినీరింగ్ విభాగంపై 10, పట్టణ ప్రణాళిక విభాగంపై – 6, పట్టణ సామాజికాభివృద్ధివిభాగంపై–1, ఉద్యానవనవిభాగంపై–1, ఎస్టేట్స్ విభాగంపై–1 అర్జీ ఉన్నాయి. అడిషనల్ కమిషనర్ (జనరల్) కె. శకుంతల, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం. ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పి రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, డెప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్ రాయ్, పీఓయుసీడీ రోహిణి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, అకౌంట్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఆర్ఎఫ్ఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనశక్తితో నూతన ఆవిష్కరణలు

ఇస్రో రిటైర్డ్ అసోసియేట్ డైరెక్టర్ శేషగిరిరావు



దాసరి రామకృష్ణను సత్కరిస్తున్న కళాశాల డీన్ రాజేష్, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డాక్టర్ టీఎస్ రవికిరణ్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): యువత తమలోని ఆలోచనా శక్తిని పెంపొందించుకోవడంతో పాటుగా కొత్త ఆవిష్కరణలు చేయాలనే కుతూహలాన్ని పెంపొందించుకోవాలని 'ఇస్రో' అసోసియేట్ డైరెక్టర్ (రిటైర్డ్) డాక్టర్ వి.శేషగిరిరావు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో రీసెంట్ ఇన్నోవేషన్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ–2024 పేరుతో సోమవారం సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా శేషగిరిరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కృత్రిమ మేధస్సు ద్వారా సాంకేతిక పరిజ్ఞాన రంగంలో కొత్త ఆవిష్కరణలు జరుగుతాయని చెప్పారు. యువత తమలోని ఆలోచనా శక్తిని పెంపొందించుకోవడం ద్వారానే నూతన ఆవిష్కరణలు సాధ్యమని తెలిపారు. సదస్సుకు మరో అతిథిగా హాజరైన ఎఫ్ ట్రానిక్స్ సీఈఓ దాసరి రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునేటప్పుడు బేసిక్ ప్రోగ్రామింగ్స్, ల్యాంగ్వేజస్‌తో పాటుగా అల్గారిథమ్స్‌లో పట్టు సాధించాలని సూచించారు. సదస్సు కన్వీనర్, సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఏ విధమైన నూతన ఆవిష్కరణలు చేయవచ్చుననే అంశాలపై విద్యార్థులకు అవగాహనకు ఈ సదస్సు ఎంతగానో దోహదం చేస్తుందని పేర్కొన్నారు. వివిధ ప్రదేశాలను నుంచి ప్రముఖ కంపెనీలకు చెందిన వారు ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, అధ్యాపకులు జి.సామ్రాట్‌కృష్ణ, కె.సుధీర్, కె.ఉదయశ్రీతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.

సెంట్రల్‌లో వెలంపల్లిని గెలిపించుకుందాం



వెలంపల్లి శ్రీనివాసరావుతో కార్పొరేటర్ రమాదేవి తదితరులు

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును వచ్చే ఎన్నికల్లో గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామని 61వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి అన్నారు. సెంట్రల్ నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావును కార్పొరేటర్ రమాదేవి, డివిజన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పార్టీ అధిష్టానం నిర్ణయానికి తాము కట్టుబడి పని చేస్తామని కార్పొరేటర్ రమాదేవితో పాటు డివిజన్ నాయకులు ప్రకటించారు. అందరం కలిసి వైఎస్సార్ సీపీని గెలిపించుకుంటే మన అందరికీ మంచి రోజులు వస్తాయని వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నియోజకవర్గంలో అందరికి అందుబాటులో ఉంటానని, డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో 61వ డివిజన్ నాయకులు నాలం బాబు, వీ వెంకటేశ్వరావు, అనిల్, చీకటి నాగమణి, రఫీ, నాగిరెడ్డి, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యపు రాచబాట వేటూరి పాట



వేటూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వరప్రసాద్, జయంతి చక్రవర్తి, సాయి మాధవ్ తదితరులు

విజయవాడ కల్చరల్: తెలుగు సాహిత్యపు రాచబాట వేటూరి పాట అని వేద గంగోత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ వరప్రసాద్ అన్నారు. వేటూరి సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని వేటూరి విగ్రహం వద్ద సోమవారం సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ మూర్తి జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వరప్రసాద్ మాట్లాడుతూ నేటి తరం రచయితలు వేటూరి సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన మహనీయుడు వేటూరి అని కొనియాడారు. వేటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, వేటూరి పాటల సాహిత్య పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి, దామోదర గణపతిరావు సాహితీ సంస్థల ప్రతినిధులు ప్రభల శ్రీనివాస్, చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, కారుమంచి రాజు, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ, దండు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోలీస్ స్పందనలో 116 ఫిర్యాదులు

విజయవాడస్పోర్ట్స్: జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో 116 ఫిర్యాదులు అందినట్లు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) వి.అజిత తెలిపారు. కమిషనరేట్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. నగదు లావాదేవీలపై 29, కుటుంబ కలహాలపై 18, ఆస్తి వివాదాలపై 14, మోసాలపై 16, ఇతర అంశాలపై 39 మంది తనకు ఫిర్యాదులు ఇచ్చినట్లు చెప్పారు. ఈ ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆయా స్టేషన్‌ల అధికారులను ఆదేశాలిచ్చారు.

కొడుకు కనిపించడంలేదని ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుమారుడు తిరిగి రాలేదని తల్లి ఫిర్యాదు చేయడంతో నున్న పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నున్న గ్రామం ఇందిరానగర్‌కు చెందిన కోట విజయ్(22)అనే యువకుడు ఈ నెల 28వ తేదీ రాత్రి 7 గంటలకు ఇంటి నుంచి స్కూటీపై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వస్తుందని విజయ్ తల్లి ప్రేమావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.